# అక్రమాల దందా దగాఖానాలు సీజ్



ఖమ్మంలో ఆర్జేఆర్ హెర్బల్ హాస్పిటల్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ ఓ డా.బి.సైదులు

**ఏడాదిన్నరగా ఖమ్మం నడిబొడ్డున అనుమతుల్లేని ఫెర్టిలిటీ సెంటర్ దందా... రేపు ప్రత్యేక కథనం**

- ఐఎంఏ, ప్రభుత్వ అధికారులకు తెలియకుండా తప్పుడు మార్గంలో నడుస్తున్న దవాఖానలు సీజ్
- ఖమ్మంలో వెలుగు చూస్తున్న అక్రమాల దవాఖానలపై చర్యలకు రంగం సిద్ధం
- తాజాగా హెర్బల్ ఆస్పత్రి సీజ్ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.సైదులు
- ఖమ్మంలో అనుమతుల్లేని రెండు ఫెర్టిలిటీ సెంటర్లు ఇటీవలే సీజ్
- రాబోవు రోజుల్లో మరిన్ని ఆస్పత్రులపై దాడులు తప్పవంటున్న అధికారులు
- అబార్షన్లు చేస్తున్నారన్న ఆరోపణలతో ఇటీవలే రెండు హాస్పిటళ్లకు తాళం
- ఫెర్టిలిటీ సెంటర్ల పేరుతో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఆస్పత్రులు

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

ప్రయివేటు వైద్య వ్యవస్థ, ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులపై ఫోకస్ పెట్టి మరీ.. నకిలీ వైద్యులను గుర్తించి, ప్రజలను ఏమార్చి, నిలువు దోపిడీ చేస్తూ.. తప్పుడు మార్గంలో హాస్పిటల్స్ నడిపే వారిని పసిగట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రూ.5 లక్షల జరిమానాతో, ఏడాది జైలుశిక్ష విధిస్తామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మంగళవారం తీవ్రమైన హెచ్చరిక జారీ చేసింది. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా అనుమతుల్లేని హాస్పిటళ్లను గుర్తించి వాటిని సీజ్ చెయ్యడంతో పాటు ఆయా హాస్పిటళ్ల నిర్వాహకులను గుర్తించి చట్టపరమైన చర్యలకు రంగం సిద్ధం చేస్తామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ స్పష్టమైన ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆరోపణలు ఎదు ర్కొంటున్న హాస్పిటళ్లపై దాడులకు ఉపక్ర మించింది. కాగా ఖమ్మంలో హైదరాబాద్‌కు దీటుగా విస్తరిస్తున్న ప్రయివేటు వైద్య రంగం పైనా ప్రభుత్వం ఓ కన్నేసింది. ఖమ్మం నగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ ఎలాంటి అనుమతు ల్లేకుండా, ఐఎంఏ, ప్రభుత్వ అనుమతు ల్లేకుండా తమ ఇష్టారాజ్యంగా స్థాపించుకుని ప్రజలను నిలువు దోపిడీకి పాల్పడుతున్న కొన్ని దగాఖానాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిరంతరం దాడులు చేస్తూ అక్రమార్కుల భరతం పడుతున్నారు. ఇటీవల వారం రోజుల్లోనే నాలుగు హాస్పిటళ్లపై దాడులు చేసి, సీజ్ చేసిన డీఎంహెచ్ఓ డా.మాలతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.బి. సైదులు, వారి బృందం తాజాగా ఖమ్మంలో హెర్బల్ పేరుతో దర్జాగా వైద్యం ముసుగులో వ్యాపారం చేస్తున్న ఆస్పత్రిని సీజ్ చేశారు.


ఇటీవల ఖమ్మం నడిబొడ్డున సీజ్‌చేసిన శ్రీ ఫెర్టిలిటీ సెంటర్.. ఆర్‌జేఆర్ హెర్బల్ ఆస్పత్రి

ఇటీవలే ఫెర్టిలిటీ సెంటర్ల ముసుగులో అబార్షన్లు చేస్తూ రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన హాస్పిటళ్లపై వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి సీజ్ చేసిన విషయం తెలిసిందే. కాగా ఖమ్మంలో నానాటికీ అధికారుల దాడుల్లో వెలుగు చూస్తున్న నకిలీ ఆస్పత్రులకు చెందిన వైద్యుల బాగోతం రాబోవు రోజుల్లో మరిన్ని 'దగాఖానాలు..' వెగులు చూసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

ఖమ్మం నగరంలోని రాపర్తి నగర్‌లో సుమారు మూడేండ్లుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్జేఆర్ హెర్బల్ పేరుతో హాస్పిటల్ నడిపిస్తున్నారనే సమాచారం మేరకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. బి.సైదులు సదరు హాస్పిటల్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డా. బి.సైదులు మాట్లాడుతూ... హాస్పిటల్ నిర్వాహకులు తమిళనాడు మెయిన్ బ్రాంచ్‌గా, ఖమ్మం సబ్ బ్రాంచ్ హెర్బల్ హాస్పిటల్ నడుపుతున్నట్లు తెలిపారు. హాస్పిటల్ తనిఖీలో అర్హత కలిగిన డాక్టర్లు లేరని చెప్పారు. హెర్బల్ క్లినిక్ కు వచ్చే రోగులకు మోతాదుకు మించిన ట్యాబ్లెట్లు ఇస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. రోజుకు 40 నుంచి 60 మంది రోగులకు ఓపి చూస్తున్నట్లు సైదులు చెప్పారు. హెర్బల్ లో డాక్టర్ గా ఉన్న వారికి ఎలాంటి వైద్య అనుభవం లేదన్నారు. ఓపి ఫీజుగా ఐదొందలు వసూలు చేస్తూ, కోర్స్ పేరుతో వేల రూపాయల విలువైన కిట్లు రోగులకు అంటగడుతున్నట్టు రోగులు చెప్తున్నారని ఆయన తెలిపారు.




వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతిలేని హాస్పిటల్‌లో వైద్యం చేయించుకుని, అనారోగ్యం కొనితెచ్చుకోవద్దని డాక్టర్ సైదులు ప్రజలకు సూచన చేశారు. అనంతరం ట్రైనీ ఐపీఎస్ మౌనిక తో కలిసి ఇటీవల అబార్షన్లు చేస్తూ రెడ్ హ్యాండెడ్ గా పెట్టుబడి సీజ్ అయిన హాస్పిటల్ వెళ్లి, హాస్పిటల్ లో ఉన్న రికార్డ్స్ ను, ఓపి కేసు షీట్లను, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నట్లు సైదులు చెప్పారు. ఈ తనిఖీలో కాశీనాథ్, స్టాటిస్టికల్ ఆఫీసర్ జె.నవీన్ కుమార్, అకౌంటెంట్ ఉపేందర్ పాల్గొన్నారు.